క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే పూజలు



వెంకటాపూర్ గ్రామస్తులతో భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని వెంకటాపూర్ శివారు గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కూతురు శ్రేయారెడ్డితో కలిసి దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటాపూర్ గ్రామస్తులు వారికి శాలువా కప్పి సత్కరించారు. ఆయన వెంట ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ, స్వరూప, మారుతి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న బండి షిడే



నారాయణఖేడ్: మండలంలోని అనంతసాగర్ గ్రామంలో మల్లన్న జాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం నిర్వహించిన బండిషిడే ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. జాతరలో బోనాలు, ఊరేగింపులు, శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు, బండ్ల ప్రదర్శనలు సర్వసాధారణం, కాగా అనంతసాగర్‌లో నిర్వహించే బండిషిడి ఆకట్టుకుంటుంది. పొడవాటి కర్రకు మనిషిని వేలాడ దీసి బండికి కట్టి దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేయడమే బండిషిడే. గ్రామానికి చెందిన ఒగ్గు సురేష్ (35)ను గ్రామస్తులు దేవాలయం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చి బండిషిడే నిర్వహించారు. ఐదుమార్లు గుడి చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు గ్రామంతోపాటు చుట్టుప్రక్కల గ్రామాలు, ఖేడ్ పట్టణం నుంచి జనం భారీగా తరలివచ్చారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని నస్తీపూర్ గ్రామ మహిళా సమైక్య సంఘం స్థాపించి 24 ఏళ్ల పూర్తయ్యాయి. ఆదివారం గ్రామంలోని వృద్ధులకు పండ్లు, గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం మాజీ అధ్యక్షులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సువర్ణ, కార్యదర్శి యస్మిన్, కోశాధికారి వరలక్ష్మీ, వీఓఏ ప్రవీణ్, గ్రూప్ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా పరికరాలను అందజేస్తున్న వెంకట లక్ష్మారెడ్డి

మునిపల్లి(అందోల్): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెంకట లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తాటిపల్లి గ్రామ క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మారుతి, రాములు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా మహాపడి పూజ



అయ్యప్ప మహాపడి పూజలో చంద్రశేఖర్

జహీరాబాద్: పట్టణంలోని డ్రీమ్ వ్యాలీ కాలనీలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజను స్వాములు వైభవంగా నిర్వహించారు. జి.బాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పడిపూజలో అయ్యప్ప స్వాములు భజనలు చేశారు. అయ్యప్ప శరణుఘోషతో కాలనీ మారుమోగింది. మాజీ మంత్రి చంద్రశేఖర్ అయ్యప్పకు పూజలు చేశారు.

నగర సంకీర్తన

జహీరాబాద్ టౌన్: పట్టణంలో హరేరామ హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నగర సంకీర్తన నిర్వహించారు. నగర సంకీర్తన ప్రధాన రహదారి నుంచి ప్రారంభమైన హనుమాన్ మందిరం మీదుగా నాగులకట్ట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నగర సంకీర్తన, భగవద్గీత, రామాయణం విశిష్టత వివరించారు.

సామాన్యుడికి కూర'గాయాలు'

- సాగు తగ్గడంతో పెరుగుతున్న ధరలు
- దిగమతులూ కారణమంటున్న విశ్లేషకులు
- సర్కార్ ప్రోత్సాహంలేక ప్రత్యామ్నాయ పంటల సాగు
- ప్రభుత్వం సబ్సిడీలు ప్రకటించాలని వినతి



కూరగాయల దుకాణం

నారాయణఖేడ్: కూరగాయల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. రాకెట్ వేగంతో నింగినంటేలా పెరుగుతుండటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. వారం కిందట ఉన్న ధరలకు ప్రస్తుతం ఉన్న ధరలకు పొంతన ఉండటంలేదు. ధరలు తగ్గుతాయని ఎదురుచూస్తున్న జనానికి నిరాశే ఎదురవుతోంది. ధరల పెరుగుదలకు ప్రధాన కారణం స్థానికంగా సాగు తగ్గడమే. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవడం ధరల పెరుగుదలకు కారణం. కూరగాయల ధరలను చూసి సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. ఏరకం కూరగాయ ధర చూసినా కిలో రూ.60 నుంచి రూ.80 పైమాటే. టమాటాలు కిలో రూ.30 నుంచి రూ.40 పలుకుతున్నాయి.

ఏటా తగ్గుతున్న సాగు

జిల్లాలో కూరగాయలసాగు ఏటా తగ్గుతోంది. రైతులు వరి, పత్తి తదితర పంటలవైపు మొగ్గుచూపుతుండటంతో కూరగాయలు అరకొరగా సాగవుతున్నాయి. గతంలో ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు విత్తనాలు, అవసరమైన పరికరాలను సబ్సిడీపై ఇచ్చేది. కొన్నేళ్లుగా సబ్సిడీలు నిలిచిపోయాయి. దీంతో సాగుకు చేసేందుకు రైతులు ముందుకు రావడంలేదు. పెరిగిన ధరలకు కళ్లెం వేయాలంటే జిల్లాలో సాగు పెరగాల్సిన అవసరం ఉంది. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కూరగాయలు అధికంగా సాగవుతుంటాయి. జహీరాబాద్ ప్రాంతంలో అల్లం, ఆలుగడ్డ సాగు అధికం. నారాయణఖేడ్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గంలోని పట్టణాలకు దగ్గరగా ఉండే గ్రామాల్లో ఆయా రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తుంటారు. ప్రభుత్వ పోత్సాహం లేక ప్రత్యామ్నాయ పంటలుగా వరి, పత్తి, సోయా సాగు చేసుస్తున్నారు. నూతన ప్రభుత్వం కూరగాయల రైతులను ప్రోత్సహించేందుకు సబ్సిడీలు ప్రకటించడంతోపాటు మండల కేంద్రాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

వెల్లుల్లి ధర అధరహో..

అల్లం, వెల్లుల్లి ధరలు ఆకాశాన్నంటాయి. కిలో వెల్లుల్లి రూ.300, అల్లం రూ.150 నుంచి రూ.200 పలుకుతున్నాయి. ధరలు పెరగడంతో కిలోకి బదులు పావుకిలో కొనుగోలు చేస్తున్నారు. అల్లం, వెల్లుల్లి ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిరావడంతో స్థానికంగా ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

కూరగాయలు	ధరలు కిలో..
టమాటా	30-40
పచ్చిమిర్చి	60
వంకాయ	80
బీన్స్	80
బీట్‌రూట్	60
క్యాప్సికం	80
క్యారెట్	60
బీర	80
కాకర	70
క్యాలీఫ్లవర్	80
క్యాబేజీ	60
చిక్కుడు	70
గోరు చిక్కుడు	60
ఆకుకూరలు	40-60

కొంచెమే కొనుగోలు చేస్తున్నాం



కూరగాయల ధరలు పెరగడంతో కొంచెమే కొనుగోలు చేసుస్తున్నాం. ప్రతీ వస్తువు ధర పెరుగుతోంది. గతంలో పప్పుతోపాటు అదనంగా కూరగాయ, రసం, చట్నీలు చేసుకునే వాళ్లం. ఇప్పుడు ఒకటి, రెండు రకాలకే పరిమితం అవుతున్నాం.

– సుజాత, టైలర్, నారాయణఖేడ్

ఖర్చులు పెరుగుతున్నాయి



కూరగాయల ధరలు పెరగడంతో ఇంటి ఖర్చులు కూడా పెరిగిపోతున్నాయి. గత వారం తక్కువగా ఉన్న ధరలు ఇప్పుడు పెరిగాయి. ఖర్చులను తగ్గించుకొనేందుకు కూరగాయలను తక్కువగా కొనుగోలు చేయాల్సి వస్తోంది. స్థానికంగా సాగు పెరిగితే ధరలు తగ్గుతాయి.

– భాగ్యవతి, గృహిణి, మావినెళ్లి

ఘనంగా సెమీ క్రిస్మస్

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని కలబ్‌గూర్ గ్రామ పంచాయతీ సదాశివనగర్‌లో పదో సెమీ క్రిస్మస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎస్.లక్ష్మారెడ్డి, వార్డు సభ్యుడు పి.కృష్ణ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎం.ఎస్ పాల్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు చూపిన శాంతిమార్గాన్ని మానవాళి అనుసరించాలన్నారు. కుల మతాలకతీతంగా సెమీ క్రిస్మస్ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు, మహిళల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాస్టర్స్ సురేష్ పాల్, రాజన్న, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్: పట్టణంలోని మెథడిస్ట్ సెంట్రల్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి చంద్రశేఖర్, ప్రమీల దంపతులు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్‌లో మాజీ మంత్రి చంద్రశేఖర్

చర్చిలకు కేకుల పంపిణీ



కేకులను పంపిణీ చేస్తున్న గూడెం మధుసూదన్ రెడ్డి



కేకు అందజేస్తున్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకొని పటాన్‌చెరులో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎమ్మెలే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి చర్చి పాస్టర్లకు కేకులు పంపిణీ చేసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే పనిచేస్తున్నారన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): క్రిస్మస్ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అందిస్తున్న కేకులను ఆదివారం రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేష్, భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పంపిణీ చేశారు. కేకులు పంపిణీ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా చర్చి పాస్టర్లకు కేకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య సినిమా సన్నాహక సమావేశం

సంగారెడ్డి: సినీ నిర్మాత సేనాపతి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య సినిమా సన్నాహక సమావేశం ఆదివారం టీఎన్‌జీఓ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బీరయ్య యాదవ్ హాజరై మాట్లాడారు. పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య చిత్రాన్ని నిర్మించాలనుకున్న దర్శకుడు సేనాపతి సంకల్పం గొప్పదన్నారు. బీసీ జాతుల్లో పుట్టిన మహనీయుల పోరాటచరిత్రలు, జీవితగాథలను సినిమాలుగా తీసి ప్రజలను జాగృతం చేయాలన్నారు. ఒక వీరుడి జీవిత చరిత్రను ప్రజలే సినిమాగా తీయడం ప్రపంచంలో ఎక్కడా జరగలేదన్నారు. కార్యక్రమంలో 17 కులాల సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ చౌహాన్, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, బీసీ సంఘాల నాయకులు భూమయ్య, శ్రీధర్, నగేష్, మల్లేష్, రాహుల్, నరేందర్, అఖిల్, రఘు తదితరులు పాల్గొన్నారు.



దొడ్డి కొమురయ్య సినిమా సన్నాహక సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

అయోధ్య రామాలయ అక్షింతల శోభాయాత్ర



నారాయణఖేడ్‌లో అక్షింతల శోభాయాత్రలో పాల్గొన్న విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ బాధ్యులు

నారాయణఖేడ్: అయోధ్య రామాలయ అక్షింతల శోభాయాత్ర నారాయణఖేడ్‌లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, సంఘ్, ఇతర క్షేత్రాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. యాత్ర రామ మందిరం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా మంగల్‌పేట్ వరకు కొనసాగింది. అనంతరం అఖిల భారత సాధుసంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ మాట్లాడుతూ జనవరి 22వ తేదీన అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కానున్నందన ప్రతిష్ఠాపన అక్షింతలను దేశం నలుమూలల నుంచి భక్తులను ఆహ్వానించేందుకు పంపించారన్నారు. పవిత్రమైన అక్షింతలను ప్రతీ కుటుంబానికి అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేదార్‌నాథ్ ఆలయ ప్రధాన పూజారి శివ్ లింగ్ మహారాజ్, ఇరక్‌పల్లి దేవిదాస్ మహారాజ్, బీజేపీ ఓబీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలే భాస్కర్ రాజ్, వేద పండితులు మోహన్‌జోషి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హత్నూర(సంగారెడ్డి): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివరం హత్నూరలో శ్రీరాముడి అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. యాత్ర ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శివాలయం వరకు కొనసాగింది. శోభాయాత్రలో భక్తులు కోలాటం ఆడుతూ, రాముని గీతాలు ఆలపించారు. అక్షింతల కలశాలకు మహిళలు మంగళహారతులు ఇచ్చారు.

ఖేడ్ సీపీఎం కార్యదర్శిగా అతిమేల మాణిక్



అతిమేల మాణిక్

నారాయణఖేడ్: సీపీఎం నారాయణఖేడ్ ప్రాంత కార్యదర్శిగా అతిమేల మాణిక్ ఎన్నికయ్యారు. ఆదివారం పార్టీ ఖేడ్ ప్రాంతీయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అతిమేల మాణిక్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలు తప్ప మరోమార్గం లేదన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానేనని తెలిపారు. బసవేశ్వర ఎత్తిపోతల, నిజాంపేట–ఖేడ్– బీదర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించి, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

తొలిసారి దర్శన భాగ్యం

కోహీర్(జహీరాబాద్): మండలంలోని సజ్జాపూర్ గ్రామంలో ప్రతిష్ఠించిన శ్రీదుర్గమ్మ, మైసమ్మ దేవతలను తొలిసారి దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంతో పులికించిపోయారు. సుమారు రూ.2 కోట్లతో నిర్మించిన ఆలయంలో కొలువుదీరిన అమ్మవార్లకు మూడు వందల మంది మహిళలు బోనాలు సమర్పించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. పట్లోళ్ల పద్మమ్మ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.



బోనాలతో వస్తున్న మహిళలు

29న చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవం

నర్సాపూర్‌రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లిలోని చిత్తారమ్మ ఆలయ వార్షికోత్సవం ఈనెల 29న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 27 నుంచి 29 వరకు ఉత్సవాలు, ప్రత్యేక పూజలు, అగ్ని గుండాలు, బండ్ల ఊరేగింపు, బోనాలు, ఒగ్గుకథ ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మెకానికల్ ఇంజనీరింగ్ వర్క్ షాప్

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'రేపటి ఆవిష్కర్తలను రూపొందించడం, మెకానికల్ ఇంజనీరింగ్, రోబోటిక్స్, కృత్రిమ మేథ అంశాల'పై రెండురోజుల వర్క్‌షాప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, మెకానికల్ ఇంజనీరింగ్ నైపుణ్యం–ఆధారిత విద్యను రూపొందించడం లక్ష్యంగా వర్క్‌షాపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి, సూరత్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ మురుగేంద్రప్ప, ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్, వరంగల్ ఎన్‌ఐటీ ప్రొఫెసర్ వి.వాసు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోగల హుడా పరిధిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆదివారం అధికారులు కూల్చివేశారు. హుడా పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేది లేదని హుడా ఎస్‌ఐ సంతోష్ హెచ్చరించారు.

వైభవంగా మల్లన్న జాతర

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండల కేంద్రంలో మల్లన్న జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు అలరించాయి.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలం బాచేపల్లిలో ఆదివారం ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో జరిగిన పనులపై డీఆర్‌పీలు సామాజిక తనిఖీ జరిపారు. తనిఖీ నివేదికపై సభలో చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పద్మ బాపురాజు, పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, యూత్ కాంగ్రెస్ డివిజన్ కార్యదర్శి పత్తిగారి శ్రీకాంత్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రామచంద్రాపురం పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు... పట్టణంలోని మల్లికార్జున్ నగర్ కాలనీ సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న వంతెన వద్ద శనివారం గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ వ్యక్తిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తి బీరంగూడ పరిసర ప్రాంతంలో భిక్షాటన చేసేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.